ప్రజాశక్తి
మంగళవారం 3 అక్టోబర్ 2023
5
శ్రీ సత్యసాయి



ఆర్‌టిసికి ఆదాయం పెంచండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీకి ఆదాయం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కడప జోన్ ఇడి గిడుగు వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం పుట్టపర్తి డిపోను సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావే శం నిర్వహించి ఆర్టీసీ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. టైర్ల సంరక్షణ మైలేజీ పెంచుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులు నడపాల న్నారు. పల్లె వెలుగు బస్సుల్లో గిఫ్ట్ స్కీంలు ప్రవేశపెట్టి ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరం ఆయన డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపిటిఐ మధుసూదన్, డిఎఐ ఇనయతుల్లా, ఎస్బిఐ పెద్దన్న, ఎంపి ఎస్బిఐ నాయక్, సూపర్‌వైజర్లు శోభారాణి, అన్ని విభాగాల సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి

రూ. లక్షకోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలి

సిపిఎం రాష్ట్ర సదస్సు డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి లక్షకోట్ల రూపాయల ఆర్థికప్యాకేజీ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి అనే అంశంపై స్థానిక లలితకళాపరిషత్ సమావేశ మందిరంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి అక్టోబర్ 2 నుండి ప్రపంచవిప్లవ దినోత్సవం నవంబర్ 7 వరకు సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా "ప్రజా రక్షణ భేరి" జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సదస్సులు, పాదయాత్రలు, ఈ నెల 21 నుండి మూడు బస్సుయాత్రలు నిర్వహించి నవంబర్ 7న విజయవాడలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి అమలు చేయడం ద్వారానే రాష్ట్రసమగ్రాభివద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆంధ్రరాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలు పూర్తవుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అమలు చేయాల్సిన కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే ఆ కేంద్రంతోనే దోస్తీకి అధికార, ప్రతిపక్షపార్టీలు పోటీలు పడుతున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో క్రింది నుండి వరుసగా విజయనగరం, శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లా వున్నాయన్నారు. రాష్ట్రజనాభాలో రాయలసీమ జనాభా 30శాతం వుండగా, రాష్ట్ర సాగుభూమి విస్తీర్ణంలో 36.8శాతం ఉందన్నారు. అయితే ఈ ప్రాంతంలోని సాగుభూమిలో కేవలం 7.6 శాతం మాత్రమే సాగునీటి వసతి ఉందన్నారు. కోటికి పైగా జనాభా ఉన్న ఉత్తరాంధ్ర పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. అనంతపురం జిల్లా మొత్తం సాగుభూమిలో వర్షంపై ఆధారపడిన భూమి 85.39 శాతం వుండగా, కర్నూలు జిల్లాలో 72.31 శాతం ఉందన్నారు.రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివద్ధికి బుందేల్ ఖండ్ తరహాలో, బొలంగీర్ - కలహండి- కోరాపుట్ (బికెకె) తరహాలో సహాయం అందిస్తామని ప్రకటించారని నాటి ప్రధాన ప్రతిపక్షపార్టీ బిజెపి ఈ ప్రతిపాదనలను ఆమోదించిందని అన్నారు. బుందేల్ ఖండ్ కు రూ. 9వేల కోట్లు, బికెకె ప్యాకేజికి రూ. 15 వేల కోట్లు కేటాయించిన కేంద్రం రాయలసీమ, ఉత్తరాంధ్రకు కేవలం రూ. 1050 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. విభజన చట్టంలో భాగంగా అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసెన్ పరిశ్రమలు, టెక్స్టైల్ పార్క్, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూలులో రూ.400 కోట్లతో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి), రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై- విశాఖ పారిశ్రామిక కారిడార్ వంటి అనేక హామీలలో గత తొమ్మిది సంవత్సరాల్లో ఒక్కటి కూడా పూర్తి అమలు కాలేదన్నారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి, వంశధార వంటి ప్రాజక్టుల నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, విజయనగరంలో నిర్మిస్తామన్నా గిరిజన కేంద్రీయ యూనివర్శిటీ, విశాఖపట్నంలో పెట్రోలియం యూనివర్శిటీలు ఇప్పటి వరకు పూర్తికాలేదని విమర్శించారు. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇచ్చిన హామీలు అమలు చేయని కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తుందన్నారు. ఈ సదస్సులో సిపిఐ, సిపిఐఎంఎల్, ఎస్ఐసిఐ(సి) జిల్లా కార్యదర్శులు సి. జాఫర్, సి. పెద్దన్న, ఎ. రాఘవేంద్ర, మానవహక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, నీటిరంగ నిపుణులు ఎస్.ఎం. భాష, ప్రజాపర్యవేక్షణ వేదిక కన్వీనర్ సత్యబోస్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి. సావిత్రి, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆర్.కె. నాయుడు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షులు షేకన్న, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల సిపిఎం కార్యదర్శులు గౌస్ దేశాయి, రమేష్, చంద్రశేఖర్, నాగరాజు, గంగరాజు, శ్రీనివాసులు, ఇంతియాజ్, ప్రకాశం జిల్లా నాయకులు సోమన్న, వెంకటేశ్వర్లు, అనంతపురం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ. నల్లప్ప, ఎం. బాలరంగయ్య, బి. శ్రీనివాసులు, నగర కార్యదర్శులు వి. రామిరెడ్డి, ఆర్.వి. నాయుడు, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తి, మండల కార్యదర్శులు మన్నీల రామాంజనేయులు, భాస్కర్, కుళ్ళాయప్ప, సూరి, పోతులయ్య, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడిన మాట తప్పిన బిజెపి ప్రభుత్వం



రాష్ట్ర విభజన చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం ఆడిన మాట తప్పింది. రాముడు తండ్రి మాట జవదాటకుండా అడవులకు వెళ్లి మాట నిలుపుకున్నాడు. బిజెపి మాత్రం అధికారం కోసమే పాకులాడుతోంది. వెనుకబడిన ప్రాంతాల కోసం కేటాయించిన బడ్జెట్‌లో నిధులు కూడా ఖర్చు చేయకుండా వెనక్కి తీసుకున్నారు. రాయలసీమ డిక్లరేషన్ అన్నారు. అది హామీగానే మిలిగిపోయింది. అవినీతి చేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులను బిజెపిలో చేర్చుకుంటూ అవినీతికి నిలయంగా బిజెపి తయారైంది. వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలి.

వి.శ్రీనివాసరావు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

పోరాటాలతో బుద్ధి చెబుదాం



వెనుకబడి ప్రాంతాల అభివృద్ధి కోసం ఇచ్చిన రాష్ట్ర విభజ హామీలు అమలు చేయకుండా బిజెపి దగా చేసింది. హక్కులు సాధిస్తానంటూ నమ్మించి అధికారం చేపట్టిన వైఎస్ఆర్‌సిపి కూడా మోసం చేసింది. ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు రాయితీలు రాలేదు. పరిశ్రమలు రాలేదు. వ్యవసాయానికి నీరు అందించలేని దుస్థితి. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఉపాధి లేక వలసలు వెళుతున్నారు. సహజ వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది. ప్రభుత్వాలను కదిలించేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. కలిసొచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని పోరాడుదాం.

జి.ఓబులు
సిపిఎం రాష్ట్ర నాయకులు

సహజవనరుల ఆధారంగా పరిశ్రమలు స్థాపించాలి



రాయలసీమ జిల్లాలో సహజసిద్ధమైన ఖనిజ సంపద ఉంది. అత్యధికంగా సూర్యరశ్మి, గాలులు వీస్తాయి. గంధపు చెక్కలు లభించే శేషాచలం అడవులు, సెల్‌ఫోన్‌లకు వినియోగించే సిలికాన్ రాయలసీమ జిల్లాలోనే లభిస్తాయి. సోలార్ పవర్, విండ్ పవర్ ఉత్పత్తి చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. స్థానికత ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

వి.రాంభూపాల్
సిపిఎం జిల్లా కార్యదర్శి

దగా చేస్తున్న బిజెపి, టిడిపి, వైసిపి



వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో బిజెపి ప్రభుత్వం ద్వంద వైఖరి అనుసరిస్తోంది. రాష్ట్ర విభజనలో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ అంటూ నమ్మించారు. అధికారంలోకి వచ్చాక విస్మరించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాడని ఆశించాం. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాడనుకుంటే చేయలేదు. ఇప్పుడు తిరిగి అధికారంలో వస్తే ప్రతి ఎకరాకు నీరు ఇస్తానంటూ నమ్మిస్తున్నారు. జిల్లాకు మనవడిని అనుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించలేదు.

ఎస్ఎం.బాషా
మానవ హక్కుల వేదిక నాయకులు

రాష్ట్రాభివృద్ధి పరిశోధనా సంస్థ ఏర్పాటు చేయాలి



వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నా, ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్నా అభివృద్ధి పరిశోధన సంస్థలు అవసరం. దేశానికి ప్రణాళిక సంఘం ఉండేది. ఇప్పుడు నీతి అయోగ్ వచ్చింది. రాష్ట్రానికి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక శాఖ ఉండేది ఇప్పుడు లేదు.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నవరత్నాలకే పరిమితం అయింది. వెనుకబడిన ప్రాంతాలకు రూ. 72 వేల కోట్లు 5 సంవత్సరాల పాటు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని రిటైర్డ్ ఐఎఎస్‌ల కమిటి నివేదించింది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలి.

సత్యబోస్
ప్రజాపరిరక్షణ వేదిక నాయకులు

పాలకులు దోపిడిదారులుగా ఉంటే వెనుకబాటు తప్పదు



వెనుకబడి ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే తాగు, సాగునీరు పుష్కలంగా ఉండాలి. అవి లేనందువల్లే జిల్లా నుంచి విద్యార్థులు, కార్మికుల వలసలు పెరిగిపోయాయి. స్థానికంగా ఉన్న కంపెనీలు తక్కువగానే ఉన్నాయి. వాటిలో కూడా శ్రమ దోపిడీ, బానిసత్వం నెలకొంది. ఇక్కడి ప్రజల వెనుకబాటును పోగొట్టేందుకు మాత్రం పాలకులకు చేతులు రావడం లేదు. అధికార ప్రతిపక్ష నేతలు ఇద్దరూ దోపిడి దారులుగానే మిగిలారు. ఆస్తులు పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజల అభివృద్ధిపై లేదు.

సి.పెద్దన్న
సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి

ఆర్థిక అసమానతలు పెరిగాయి



ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా పరిశీలిస్తే ప్రజలు ప్రభుత్వాలపై ఆధారపడి జీవించేలా పరిపాలన చేస్తున్నాయి. స్వశక్తితో జీవిస్తే రాజకీయ పార్టీల ఆటలు సాగవని కుట్ర చేస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా కొత్త కొత్త వాగ్దానాలు చేర్చుకుంటున్నాయి. అవి అమలు నోచుకోలేనివే. ఆర్థిక అసమానతలతో మహిళలు, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వీటిపై ప్రభుత్వాలకు అవగాహన ఉన్నా కూడా నివారించే చర్యలు చేపట్టడం లేదు. కౌలు రైతుల జీవితాలు అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రం సుభిక్షంగా ఉందంటే కౌలు రైతులు వ్యవసాయం చేయడం వల్లనే అన్న సత్యాన్ని గ్రహించాలి.

చంద్రశేఖర్
మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్

ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర విధానాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ప్రజా ఉద్యమాలతోనే ప్రభుత్వాలను కదిలించే శక్తి ఉంది. విద్యార్థులు కూడా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి. నేడు విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని బయటకు వస్తే ఎక్కడ పని చేయాలో దిక్కుతోచని స్థితి నెలకొంది. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

రాఘవేంద్ర
ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి

మిలిటెంట్ ఉద్యమాలు చేద్దాం



వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక నిధులు కేటాయించాలి. నీటి కేటాయింపులు జరగాలి. ఏ ప్రభుత్వం వచ్చినా అవి అమలు చేయని దుస్థితి నెలకొంది. ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సామర్థ్యం పెంచాలి. కాలువల పునరుద్ధరణ జరగాలి. ఎన్టీఆర్, వైఎస్ఆర్ చూపిన శ్రద్ధ నేటి పాలకులు చూపడం లేదు. సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటుకు పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు మిలిటెంట్ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది.

సి.జాఫర్
సిపిఐ జిల్లా కార్యదర్శి

'అనంత'లో ఎన్ఐఎ అధికారుల సోదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



కదిరిలో సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) అధికారులు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోదాలు నిర్వహించారు. అనంతపురం నగరంలో ఇద్దరి ఇళ్లలో నిర్వహించగా, కదిరి ప్రాంతంలో ఒకరి ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతపురం నగరంలోని బిందెలవారీ కాలనీలో ఉండే శ్రీరాములు అనే వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈయన కుల నిర్మూలన పోరాట సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. అదే విధంగా శింగనమల మండలంలోని సలకంచెరువు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. ఆ తరువాత నగరంలోని మానవ హక్కుల వేదిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమన్వయకర్త అయిన చంద్రశేఖర్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈయన రిటైర్డు ప్రిన్సిపల్‌గా ఉన్నారు. కదిరిలోని కూటగుళ్లలో ఉండే రామక్కగారి చంద్ర ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. మొత్తంగా మూడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించడంతో అనంతపురం జిల్లాలో కలకలం రేగింది. వారి ఇళ్లలో కొన్ని వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే అధికారికంగా వెల్లడించలేదు.

గొంతునొక్కే చర్యల్లో భాగమే : చంద్రశేఖర్, మానవహక్కుల వేదిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త

ప్రజాస్వామిక అంశాలపై మాట్లాడేవారిని భయపెట్టి, గొంతునొక్కే చర్యల్లో భాగమే ఇది అని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎన్ఐఎ సోదాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ఎక్కడా రహస్య కార్యక్రమాలేవీ చేయలేదన్నారు. బహిరంగంగా జరిగే కార్యక్రమాల్లోనే పాల్గొంటూ వస్తున్నామన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తులుగానే ఉన్నాం. ఎన్ఐఎ అధికారులు సోమవారం ఉదయం ఇంటికొచ్చి సోదాలు నిర్వహించారన్నారు. మొబైల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, కొన్ని పుస్తకాలను స్వాధీనం చేసుకుని వెళ్లారు. ఒక సిఐ, ఒక ఎస్ఐ వచ్చారని. మార్చి 2021లో నమోదయిన కేసుకు సంబంధించి అంశమని ఒక పేపరును చూపించారని సోదాలు అనంతరం వెళ్లిపోయారని అన్నారు.

ప్రభుత్వ భూములు బడాబాబుల జాగీరా..?



పోటో:- 1 సమావేశంలో మాట్లాడుతున్న వృకాసం మహిళ కన్వినర్ రాణీ..

వృకాసం రాష్ట్ర నాయకురాలు రాణి

ప్రజాశక్తి - చిలమత్తూరు

భూమంటే బాడాబాబుల జాగీరు కాదని పేదల ప్రజలు, కష్టజీవుల హక్కు అని వృకాసం రాష్ట్ర నాయకులు రాణి పేర్కొన్నారు. చిలమత్తూరు మండలంలో సోమవారం పదోరోజు భూస్వాధీన పోరాటం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వృకాసం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం సెంటిన్నర భూమి ఇవ్వమని పేదోడు అడుగుతుంటే మాత్రం అక్రమంగా కేసులు పెడుతున్నారని అన్నారు. అధికారులు ఎవరికోసం పని చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రియల్టర్లకు, బడాబాబులకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వ స్థలాలను ధారాదత్తం చేసేందుకు తహతహలాడుతూ భూ స్వాదీన పోరాటం చేస్తున్న నాయకులపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. పెట్టుబడిదారులపై అంత ప్రేమ ఉంటే పట్టాభూములను కొనుక్కోవ్వాలని లేదా వారి స్వంత భూమి ఉంటే అప్పగించాలని అన్నారు. పేదల హక్కుగా ఉన్న అసైండ్ భూములను, పోరంబోకు భూములను బడాబాబులకు అప్పగిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కూడు గూడు గుడ్డ ప్రజల అందరి ప్రాథమిక హక్కు వాటిని సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ఇంటి వద్దకు వచ్చి ఓట్లు అడిగిన బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు భూపోరాటం చేస్తున్న వారి గుడిసెల వద్దకు వచ్చి పేదలు పడుతున్న కష్టంపై అడిగేందుకు మనసు రాలేదని విమర్శించారు. అలాంటి నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఊర్లు కట్టిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం మొదట పేదలకు ఇంటిస్థలాలివ్వటంపై దృష్టిసారించాలని సూచించారు. పది రోజులుగా పేదలు గుడిసెలు వేసుకొని పోరాడుతున్నా స్థానిక రెవెన్యూ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వంక పోరంబోకులు, పేదలకు ఇచ్చిన అసైండ్ భూములు, ఇరిగేషన్ కాలువలు, వంకలు చెరువు సుమారు 300 ఎకరాల మేర ఆక్రమించుకున్న బడా భూస్వామికే అధికారులు తివాచి పరుస్తున్నారన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చే వారకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీచిత్రపటానికి పూలమాలలు వేసి భూ స్వాధీన పోరాట కేంద్రం వద్ద సత్యాగ్రహదీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమం లో వృకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, వెంకటరమణ, నారాయణ, ఇళ్లస్థలాల సాధన కమిటి సభ్యులు సదాశివరెడ్డి, చందు, చంద్ర, చరణ్, ఆనంద్, రమేష్, రహంతుల్లా, శివ, మణిస్వామి, రియాజ్, ఆటో కలీం తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - మడకశిర

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. రసాయనికి ఎరువులు, మందులకు స్వస్తి పలుకుతూ మడకశిర సోమవారం మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల మండలం ఆర్.వడ్రహట్టి గ్రామ సమీపాన రైతులు నాగరాజు, హనుమంతరాయ, కరియమ్మలు పకతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కంది, అలసంద, ఆముదం, అనప, గోరు చిక్కుడు, గోవిందపురంలో అనిత లక్ష్మి 5 ఎకరాలలో సాగు చేసిన అంతర పంటలను, నీలకంఠాపురంలో మోహన్ దాస్ మూడు ఎకరాల సాగు చేసిన అంతర్ పంటలను జవహర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, సబ్ కలెక్టర్ కార్తిక్, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విశ్రాంతి ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్, ఎస్పీ మాధవ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, జెడ్పిటిసీ అనంతరాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కార్యదర్శి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే దిశగా వ్యవసాయాన్ని రైతులు సాగు చేసి అధిక లాభాలను ఆర్జించాలని సూచించారు. రైతులకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాలో వర్షపాతం చాలా తక్కువగా ఉందని చెప్పారు. అనంతరంమడకశిర రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన ప్రకతి వ్యవసాయ పంట సాగు విధానంపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తిలకించారు. ఈ కార్యక్రమంలోజిల్లా వ్యవసాయ అభివద్ధి అధికారి సుబ్బారావు, డిపిఎం లక్ష్మానాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ ,జిల్లా అగ్రిగోల్డ్ మెంబర్ హనుమంత రెడ్డి ప్రకతి వ్యవసాయ పంట సాగు చేస్తున్న రైతులు నాగరాజు, కరియమ్మ అనుమప్ప నరసింహామూర్తి తిమ్మరాజు అనిత, ఎంపీపీ కవిత, డ్వామా పీడీ రామాంజనేయులు, డిఆర్‌డిఎ



బీడుభూమిని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, తదితరులు

పీడీ నరసయ్య, డిఎల్‌డిఒ శివారెడ్డి, డిపిఒ విజయకుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా .శుభదాస్, రోళ్ల ఎంపీడీవో ఆజాద్, తహశీల్దార్ హసీనా సుల్తానా,. మడకశిర తహశీల్దార్ మురాద్ షా వలి ఎంపీడీవో సోనీ బాయ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఇతరులు పాల్గొన్నారు.

అగ్రిబోర్డు చైర్మన్ వినతి : క్షేత్ర పర్యటన భాగంగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి జిల్లా అగ్రిగోల్డ్ చైర్మన్ అవతల రమణారెడ్డి, సభ్యులు హనుమంత రెడ్డిలు కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లాలో సుమారు 64 హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగులో ఉందని ఇక్కడ ఒక ఉద్యాన పరిశోధన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్యాపకుల వినతి : 32 సంవత్సరాలనుండి ఇంటర్ వత్తి విద్యలో పనిచేస్తన్న తమను క్రమబద్ధీకరించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఇంటర్ వృత్తి విద్య జూనియర్ అధ్యాపకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి విన్న వించారు. అనేక సంవత్సరాలనుండి టైమ్ స్కేల్ ప్రాదిపదికన ఉండడం వలన రెగ్యులర్ చేయడం ద్వారా ప్రభుత్వానికి చాలా తక్కువ భారం అవుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 140 మంది మాత్రమే ఉన్నామని తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్ నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మిక, కర్షక ద్రోహి మోడీ

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కాల్ కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి ద్రోహం చేస్తోందని దీనికి వ్యతిరేకంగా అందరం కలిసి ఉద్యమించాల్సిన సమయం అసన్నమైందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ అన్నారు. ఢిల్లీలో జరిగిన కార్మిక కర్షక సదస్సు సందర్భంగా లఖీమ్ పూర్ ఖేరీలో జరిగిన రైతుల హత్యల రోజుగా పరిగణిస్తూ సోమవారం బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్ర వేత్త స్వామి నాథన్‌కు ఘనంగా నివాళులు అర్పిం చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇఎస్ వెంకటేష్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి, హిందూపురం రైతు సంఘం కార్యదర్శి రాచపల్లి సిద్ధారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. అమలు చేయాలని అడిగిన రైతన్నలపై, కార్మిక సంఘాల పైన హత్యలకు పాల్పడుతోందన్నారు.కార్మికుల సంక్షేమం కోసం నాడు 44 చట్టాలు ఉంటే వీటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసిందన్నారు. ఇది చాలదన్నట్లు రైతులకు వ్యవసాయ చట్టాలను రద్దుచేసి నల్ల చట్టాలను అమలు



నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకరటేష్

పరుస్తు రైతులను నట్టేట ముంచటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్లు వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించాలని కుట్ర పన్నుతోందన్నారు. ఈ రకమైన చట్టాలు అమలు చేస్తే రైతులు వ్యవసాయాన్ని వదిలేసి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలు అమలు జరిగితే దేశంలో ఆర్థిక మాద్యంతో పాటు ఆహార మాద్యం ఏర్పడుతుందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు కలిసి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, నాయకులు జగదీష్, రామకృష్ణ, అత్తర్‌బాబా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, నాయకులు ఆనంద్, మంజునాథ్, రామంజప్ప, గుర్నాథ్, చంద్ర, ప్రీకాట్ బి వర్కర్స్ యూనియన్ నందీష్, సదాశివరెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యల ను పరిష్కరించాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక గాంధీ పార్కు వద్ద ఉన్న మాస్టర్ పాయింట్ నుంచి ర్యాలీగా బయల్దేరి కళాజ్యోతి, కాలేజ్, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఆప్కాస్ విధానం రద్దు, 010 పద్దు ప్రకారం వేతనాలు తదితర డిమాండ్లను ప్రభు త్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ 2వ



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

మహాసభలను ఈ నెల 5వ తేదీ ధర్మవరంలో నిర్వహిస్తామని, రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని, జిల్లాలోని మున్సిపాలిటీల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ నాయకులు. ఎస్ బాబావాలి, సహాయ కార్యదర్శులు నాగేంద్ర, చౌడప్ప, పరమేష్, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ సలహాదారు వెంకటేష్, అధ్యక్షులు బాబు, పుల్లన్న, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ముత్యాలప్ప, ధనరాజ్, కార్మికులు పాల్గొన్నారు.

మహాత్ముడి స్ఫూర్తితో ముందుకెళ్దాం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో ముందుకెళ్దామని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి ఆమె కోర్టు ఆవరణలో శ్రమదానం చేపట్టారు. జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సబ్ జైలులో గాంధీ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో సేవలందిస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు



కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎడిజె కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

కావాలన్నారు. ఖైదీలు ప్రవర్తన లో మార్పు వచ్చేలా మెలగాలని సూచించారు. అనంతరం ఖైదీలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో ఎఒ ఆనం దరావు, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతో షికుమారి, అంజనమ్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని కలప అక్రమ రవాణా

హిందూపురం : రూరల్ మండల పరిధి లోని తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో కలప అక్రమ రవాణా ఆగడం లేదు. ఇటీవల ఇదే విషయమై ప్రజాశక్తిలో కథనం రావడంతో అధికా రులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. దీంతో సోమవారం మళ్లీ ట్రాక్టర్ల ద్వారా కలపను పరిశ్రమలకు తరలించడం గమనార్హం. ఇదంతా అటవీ శాఖ అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి

కదిరి టౌన్ : ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం కల్పించాలని వజ్ర ఫౌండేషన్ అధ్యక్షులు వజ్ర భాస్కర్‌రెడ్డి కోరారు. పట్టణంలోనీ దత్త గార్డెన్స్‌లో సోమవారం ఎల్ఐసి 11వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎల్ఐసి ఏజెంట్‌గా పని చేశానని, 20 ఏళ్లలో ఉచితంగా 3వేల కంటి ఆపరేషన్లు చేయించానని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించానని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సిఎ టాపర్‌కు అభినందనలు

పుట్టపర్తి క్రైమ్ : మండల పరిధిలోని కోవెలగుట్టపల్లికి చెందిన నాగేంద్రమ్మ, కేశవ దంపతుల ప్రథమ కుమారుడు శ్రీకాంత్ జాతీయ స్థాయిలో సిఎస్ఎలో ప్రథమ ర్యాంకు సాధించాడు. దీంతో సోమవారం శ్రీకాంత్‌ను పలువురు నాయకు లు అభినందించారు. మాజీ మంత్రి పల్లె రఘు నాథ్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి శ్రీకాంత్‌ను అభినందిం చి ఆర్థిక సాయం అందజేసి ఉన్నత చదువులకు తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. రామాం జనేయులు ఆర్థిక సాయం అందించి భవిష్యత్తులో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమం లో బిసి నాయకులు సామ కోటి ఆదినారాయణ, రామాంజనేయులు, గంగాధర్, రామకృష్ణ, సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు. సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ శ్రీకాంత్‌తో పాటు కుటుంబ సభ్యులను అభినందించారు.

ఎన్ఐఎ అదుపులో కుటాగుళ్ల వాసి

ప్రజాశక్తి-కదిరి టౌన్

దేశ వ్యాప్త తనిఖీల్లో భాగంగా కేంద్ర నిఘా వర్గాల సమాచారం మేరకు సోమవారం పట్టణ పరిధిలోని కుటాగుళ్లలో స్థానిక పోలీసుల సహకారంతో కర్నాటక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్ఐఎ అధికారులు సోదాలు నిర్వహించారు. మావోయిస్టు నేత ముఖ్య అనుచరుడు రామక్కగారి చంద్రను ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకొని పట్టణ స్టేషన్లో విచారిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. చంద్ర ఇంట్లో ఫిస్టల్‌తో పాటు 14 రౌండ్ల బుల్లెట్లు, విప్లవ సాహిత్యాలను అధికారులు స్వాధీనం చేసుకున్న ట్లు తెలుస్తోంది. స్థానికుల వివరాల మేరకు.. కుటాగుళ్లకు చెందిన విప్లవకారుడు, దివంగత నేత రవూఫ్ ప్రజాసమస్యలపై సామాజిక అంశాల్లో చురుగ్గా పాల్గొనేవారని, ఆయన స్ఫూర్తితో చంద్ర, ఆయన సోదరుడు దివంగత రమేష్ రవూఫ్ అడుగుజాడల్లో నడిచేవారన్నారు. రవూఫ్, ఆ తర్వాత రమేష్ మృతితో అప్పటి నుంచి రామక్కగారి చంద్ర విప్లవ కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొన్న దాఖలాలు లేవనే చెప్పారు. స్థానికంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని, ఆయనపై స్థానికంగా ఎటువంటి ఫిర్యాదులు, కేసులు నమోదు కాలేదు. కేవలం గతంలో మావోయిస్టు సంఘాలతో కలిసి పని చేయడం వల్ల ఇప్పటికీ ఆ వర్గాలతో సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో 'కుశలవ' భూముల్లో విత్తనం

ప్రజాశక్తి-లేపాక్షి

కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కొండూరు గ్రామ సమీపంలో 'కుశలవ' సంస్థ ఆధీనంలో ఉన్న భూములను ఆక్రమించి ఉలవలు, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శు అన్నమయ్య, ఎంవి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ భూములను పేదలకు ఇచ్చేంత వరకూ పేదలకు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అంతకుముందు కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోర్లకుంట గ్రామానికి చెందిన మోక్షిత చేత జెండాను ఆవిష్కరించారు. వారు మా ట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూల న లక్ష్య సాధనకై 1998 అక్టోబర్ 2వ తేదీ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆవిర్భవించిం దన్నా రు. అప్పటి నుంచి దళితులు, పేదల పక్షాన అనేక ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమాల్లో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు రాయుడు, జ్యోతమ్మ, లేపాక్షి మండల కమిటీ అధ్యక్షులు గోపాల్, రైతులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ ఛాంపియన్‌గా జిల్లా బాలికల జట్టు

హిందూపురం : కర్నూలులో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల రగ్బీ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ పోటీలో కర్నూలు జట్టుతో తలపడి 10/05 స్కోరుతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. జట్టు విజయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లోహి త, సాయిమనీషా, ప్రియమణి, కోచ్ రూపవతిని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, యాసిన్ మాలిక్ అభినందించారు. అలాగే జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలవగా కోచ్ సందీప్ క్రీడాకారులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రగ్బీ సంఘం సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, విష్ణు, మల్లికార్జున, ముస్తఖీమ్, అభినందించారు.

సబ్సిడీ దాణా కోసం దరఖాస్తు చేసుకోండి

గాండ్లపెంట : మండల పరిధిలోని పాడి రైతులు సబ్సిడీతో అందజేసే దాణా కోసం దరఖాస్తు చేసుకోవా లని పశువైద్యాధికారి బి.చెన్నకేశవులు నా యక్ తెలిపారు. గాండ్లపెంటలో సోమవారం ఆయ న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న పాడి రైతులకు 75 శాతం సబ్సిడీ తో దాణా అందజేస్తామన్నారు. ఒక రైతుకు 25 కిలో ల ప్యాకెట్ సబ్సిడీ ధరతో ఇస్తామని, స్థానిక పశు వైద్యశాలకు ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు.

నేడు శ్రీవారి హుండీల లెక్కింపు

కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను కానుకలను మంగళవారం(నేడు) ఉదయం 6 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలక్రిష్ణ తెలిపారు.

వైఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేత 'కదిరి అంబేద్కర్ లయన్స్'

ప్రజాశక్తి-కదిరి అర్బన్

నియోజకవర్గ వ్యాప్తంగా యువతలో క్రీడాస్ఫూర్తి నింపడానికి వైఎస్ఆర్ పేరు మీద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ బత్తల హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమ వారం పట్టణంలోని బత్తల హరిప్రసాద్ నివాసం వద్ద ఆయన బహుమతులు ప్రదానం చేశారు. విజేత కదిరి అంబేద్కర్ లయన్స్ జట్టుకు రూ. 1 లక్ష నగ దు, మెమెంటో, రన్నరప్‌గా నిలిచిన తనకల్లు టైటా న్స్ జట్టుకి రూ. 50 వేలు నగదు, మెమెంటో అంద జేశారు. మండల స్థాయిలో గెలుపొందిన, రన్నరప గా నిలిచిన జట్లకు కలిపి మొత్తం రూ. 1.35 లక్షలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మోహన్ రెడ్డి

అందజేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, బత్తల వెంకట రమణ, బాహుద్దీన్, వైస్ ఎంపిపి దశరథ నాయుడు, పురుషోత్తంరెడ్డి, సంపంగి గోవర్ధన్, రమణ, బాబా, ఫారుక్, విశ్వనాథరెడ్డి, చంద్ర, జాకీర్, నజీర్, హరి, క్రీడాకారులు, బత్తల యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమిపూజ

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలోని పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సోమవారం జడ్పిటిసి కోటి సుధ, ఎంపిడిఒ సాయిమనోహర్, పంచాయతీరాజ్ ఇంజినీర్ రమణయ్య భూమిపూజ నిర్వహించారు. స్థానిక విద్యాధర పాఠశాల సమీపంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి జడ్పిటిసి కోటి సుధ భూమిపూజ చేశారు. జడ్పిటిసి, ఇంజినీర్ రమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవ తో నిధులు మంజూరు కావడంతో ఈ పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి దివాకర్, నాగరాజు, పకీరప్ప పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మేజర్ గ్రామ పంచాయ తీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి అధ్యక్షతన సోమవారం మేజర్ పంచాయతీ గ్రామ సభ నిర్వహించగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి వేణు, వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, ఎంపిటిసి పూజారి ఈశ్వరయ్య, రమాకాంత్‌రెడ్డి, వార్డ్ మెంబర్ లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, జిపి నరసింహులు, బాబు, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని ఉపసర్పంచి అసహనం

గ్రామసభలో ప్రొటోకాల్ పాటించలేద ని, సమావేశంలో తనకు సీటు కేటాయించకుండా అనర్హులను గ్రామసభ కుర్చీల్లో కూర్చోబెట్టారని ఉప సర్పంచి వేణు ప్రజలు కూర్చునే కూర్చీలోనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబును వివరణ కోరగా తాను రెండ్రోపుల క్రితమే ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు స్వీకరించానని, ప్రజాపతినిధుల విషయంలో పూర్తిగా అవగాహన లేకపోవడం వల్ల ఇలా జరిగిందని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా బాధ్యత వహిస్తానని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రొద్దం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైఎస్ఆర్‌టిఎఫ్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. మండల శాఖ ఆధ్వ ర్యంలో సోమవారం తురకలాపట్నం జడ్పి హైస్కూల్ లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవి.కృష్ణారెడ్డి ఎన్నికల పరిశీలకు లుగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.అంజనప్రసాద్, అధ్యక్షుటుగా కె.సాయినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర, కోశాధికారిగా కె.యోగానందరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ.ప్రభాకర్ రెడ్డి, ఎ.రవీంద్ర, ఎం. సరస్వతి, పి.ప్రభాకర్, కార్యదర్శులుగా ఎం. రామచంద్రారెడ్డి, పి.నరసింహులు, పి.శ్రీనివాస రెడ్డి, బి.రమణతో పాటు జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

'ఉపాధి' పనుల ప్రణాళికపై అవగాహన

ప్రజాశక్తి-నల్లచెరువు

2024-25 ఏడాదికి సంబంధించి లేబర్ బడ్జెట్ పనుల ప్రణాళికపై నల్లచెరువు, ఉబిచెర్ల, ఒరువాయి పంచాయతీల్లో సోమవారం మొదటి విడత గ్రామసభలు నిర్వహించారు. ఇందులో ఎంపిడిఒ శకుంతల, ఆయా గ్రామాల సర్పంచులు పంచరత్నమ్మ, బికారి, గంగాదేవి, ఎంపిటిసి రామలక్ష్మి, లక్ష్మిదేవి, ఎపిఒ మంజుల, ఇసి బాలునాయక్ పాల్గొన్నారు. మిగతా సర్పంచులు, ఎంపిటిసిల అధ్యక్షతన 9 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని వారు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపినాథ్, వసుంధర, రమణప్పనాయుడు, దివ్య, గంగాధర్, నరేష్, నరసింహా, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, అనసూయమ్మ, జహీర్ అబ్బాస్, హిమకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ రవికుమార్ రెడ్డి, బావాజీ, వేమనారాయణ, తిరుపాల్, రమణ, విశ్వనాథ్‌రెడ్డి, రాజునాయక్, రామ్మోహన్, గురప్ప, శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని కరావులపల్లి తండాలో ప్రభుత్వ స్థలం 3 సెంట్ల విషయంలో కొంతకాలంగా జగదీష్ నాయక్, న్యాయవాది కెసి తిప్పానాయక్ మధ్య వివాదం నెల కొంది. తిప్పనాయక్ సోమవారం ద్విచక్ర వాహ నంపై గోరంట్లకు వస్తుండగా కర్రతో దాడి చేయ డంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ధనుంజయ రెడ్డి తెలిపారు. డాడిలో గాయపడిన తిప్పానాయక్‌ను హిందూపురం ప్రభుత్వ ఆసుప త్రికి, అక్కడి నుంచి అనంతపురం తరలించారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

గోరంట్ల రూరల్ : మహిళపై దాడి చేసిన సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బూదిలి గ్రామానికి చెందిన రత్నమ్మ వారి బంధువు అయిన బాలు(25)ను పెంచుకుంటుంది. బాలు పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో స్నేహితుల ఇంటి వద్దకు వెళ్లి అడగడంతో ఆమెపై దాడి చేసిన భట్టి, పార్వతమ్మ, రత్నమ్మ, జగ్గు, సన్నీలపై బాధితురాలు రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైసిపి అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

ప్రజాశక్తి- సోమందేపల్లి

వైసిపి అధిష్టానం ఆదేశిస్తే పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే ఎస్.నారాయణ రెడ్డి కుమారుడు రమాకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం సోమందేపల్లిలోని తన నివాసంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మా తండ్రి నారాయణరెడ్డి ఐదేళ్లు ఎమ్మెల్యేగా పని చేశారన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన తనకు నియోజకవర్గ వ్యాప్తంగా అందరితో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పార్టీ పరిశీలకుడు మంత్రి పెద్దిరెడ్డి, పార్టీ అధిష్టానానికి బయోడేటా కూడా అందజేశానని తెలిపారు. ఆయనతో పాటు మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి, ఆమె భర్త నరసింహమూర్తి, వార్డు మెంబర్ నరసింహమూర్తి, నాయకులు గోవిందమ్మగారి శ్రీనివాసులు, జగదీష్, శేఖర్‌రెడ్డి, బాబావలి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'సత్యమేవ జయతే' దీక్ష

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో, ఆయన సతీమణి భువనేశ్వరి రాజమహేంద్రవరంలో చేపట్టిన 'సత్యమేవ జయతే' దీక్షకు సంఘీభావంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు జాతీయ జెండాను చేత బట్టి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. తొలుత గాంధీ జయంతి సంద ర్భంగా పట్టణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, మల్లికార్జున, కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షు డు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, రొళ్ల కన్వీనర్ దాసిరెడ్డి, సుబ్బరాయుడు, నరసింహ రాజు, కార్యదర్శ పుల్లయ్యచౌదరి పాల్గొన్నారు.

గుడిబండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామం లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ముందుగా ఆయన గాంధీ చిత్రపటానికి పూలమా ల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 'బాబుతో నేను' కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ బోర్డులో సంతకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మంజునాథ్, దుర్గేష్, న్యాయవాది శివకుమార్, రాజు, భీమరాజు, కృష్ణప్ప, జయకుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో సైకో రూల్ సాగుతోందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక తహ శీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సత్యమేవ జయతే దీక్షలో భాగంగా ముందుగా గాంధీజీ, ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాల లు వేసి నివాళులర్పించారు. సిఎం జగన్ సైకో పను ల వల్ల చంద్రబాబు అన్యాయంగా జైల్లో ఉన్నారన్నా రు. అందుకే జైలులోనే సత్యాగ్రహ దీక్ష చేస్తు న్నారన్నారు.

లేపాక్షి : టిడిపి ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించగా మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. దీక్షలో మండల కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్, రవి, చంద్ర, వీరశేఖర్, ప్రభాకర్ రెడ్డి, మంజు, క్రిష్టప్ప, మాలక్క పాల్గొన్నారు.

అగళి : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ అగళిలో 9 మంది టిడిపి కార్యకర్తలు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం ముందు కూర్చుని శిరోముండనం చేయించుకుని నిరసన తెలి పారు. వారిలో మంజునాథ్, నాగరాజు, రాజన్న, లింగరాజు, శివప్ప, ముకుందప్ప, జయప్ప, శివకుమార్ ఉన్నారు.



ధర్మవరంలో దీక్షలోపాల్గొన్న పరిటాల శ్రీరామ్, తెలుగుతమ్ముళ్లు

కదిరి అర్బన్ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి నాగన్న మద్దతు తెలిపారు. దీక్షలో కందికుంట సతీమణి యశోదమ్మ, తుమ్మల ఇలియాజ్, అరుణ్, రాజేష్ పాల్గొన్నారు.



మడకశిరలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న గుండుమల, టిడిపి నాయకులు

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం ముందు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు దీక్షలు చేపట్టారు. పల్లె మాట్లాడుతూ చంద్రబాబును విడుదల చేసేంత వరకూ మా పోరాటం ఆగదన్నా రు. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని తెలిపారు.

రొద్దం : మండల పరిధిలోని తురకలా పట్నం గ్రామంలో జాతీయ జెండా చేతబూని సత్య మేవ జయతే దీక్ష చేపట్టారు. దీక్షలో శ్రీనివాసులు, అంజనరెడ్డి, మాజీ డీలర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, రామ గోపాల్, టిఎన్ఎస ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరికృష్ణ, షణ్ముఖ, నాగేంద్ర, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ముదిగుబ్బ : 'సత్యమేవ జయతే' దీక్షకు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, జనసేన మండల కన్వీనర్ గుర్రం జయచంద్ర సంఘీభావం తెలిపారు. దీక్షలో మండల మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, నారాయణ స్వామి, గడ్డం మోహన్, కొలసాని చంద్ర, కణం చంద్ర, నారాయణస్వామి, సంకేపల్లి భాస్కర్, పాల్గొన్నారు.

జిల్లావాసులకు 'మహాత్మా గాంధీ విచార్ గౌరవ్' అవార్డు

మడకశిర : పట్టణానికి చెందిన దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతుకు గాంధీజీ నవవిచార్ మంచ్ సెక్యులర్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరఫున 'మహాత్మా గాంధీజీ విచార్ గౌరవ్ అవార్డు-2023' దక్కింది. దేశ వ్యాప్తంగా సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, విద్య, వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. కరోనా సమయంలో హనుమంతు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు నచ్చి అవార్డు ప్రకటించారు. అవార్డును ఆదివారం మహారాష్ట్రలో అందజేసి సన్మానించారు. గౌరవ చిహ్నం, రూ. 5 వేల విలువ చేసే పుస్తకాలు అందజేశారు.

హిందూపురం : 'మహాత్మా గాంధీజీ విచార్ గౌరవ్ జాతీయ పురస్కారం-2023'ను హిందూపురం వాసి ఉమర్ ఫారూఖ్ ఖాన్ సోమవారం మహారాష్ట్రలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. తాను చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించినట్లు ఆయన తెలిపారు.

'పల్లె' ఆర్థికసాయం


పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని వీరజిన్నేపల్లికి చెందిన లక్ష్మీనారాయణ భార్య భాగ్యమ్మ మృతి చెందడంతో సోమవారం పల్లె రఘునాథ్‌రెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ సిఎలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలవడంతో అతడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి.
O.S. No.366/2019
Between:-
గోరంట్ల ఈశ్వర్ రెడ్డి S/o. నాగిరెడ్డి, Working as వెటర్నరీ హాస్పిటల్, గాలివీడు గ్రామము మరియు మండలము. ....Plaintiffs
మరియు
D1: N.మహజ, W/o. షానవాజ్
D2: N.ఆఫ్రిది, W/o. జయనుల్లబుద్దీన్
D3: N.షాబాజ్, S/o. షానవాజ్
All are residing at Door No. 1/1102-B5, వెన్నెల హోటల్ స్ట్రీట్, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా. .....Defendant
పై దావాలోని D1, D2 and D3 ప్రతివాదులకి దావా సమన్సు
పై దావాలోని వాది, తనకి రావలసిన ప్రామిసరీ బాకీ వసూలు నిమిత్తము ప్రతివాదులు అయినా మీ పైన పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 13-10-2023వ తేదీన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 13-10-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు న్యాయముగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
వాయిదా తేది: 13-10-2023
G. గురులింగస్వామి, B.A., B.L. వాది తరుపు వకీలు, కదిరి.

యువత గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి



గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ, తదితరులు



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కదిరి ఎమ్మెల్యే



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కందికుంట

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నేటి తరం జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి సూచించారు. గాంధీ జయంతి పురస్కరించుకొని సోమవారం ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి ఆంగ్లేయుల పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు గాంధీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఎఎస్పీ ఎన్.విష్ణు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పి విజయ్‌కుమార్, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, టైటాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : గాంధీ ఆలోచనలు, సిద్ధాంతాలు, భావాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయని డిఇఒ మీనాక్షి తెలిపారు. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయని కొనియాడారు. స్థానిక బుక్కపట్నం రహదారిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు గాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ రెడ్డప్ప, ఉపాధ్యాయులు చంద్రమనోహర్, లలిత, శ్రీనివాసులు, మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు బెల్లం నజీర్, మారాల ఓబులేసు, మోహన్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ, లాల్ బహుదూర్‌శాస్త్రి చిత్రపటాలకు ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం గాంధీ ఎనలేని సేవలు చేశారని, సిఎం జగన్ ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కమిషనర్, ఎంపిపిలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు ఆధ్వర్యంలో నాయకులు వెంకటనారాయణ, వెంకటస్వామి, రవి, సకలరాజు తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి సభ నిర్వహించి కళాశాల ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యక్రమం లో ప్రిన్సిపల్ ప్రభాకరరెడ్డి, అధ్యాపకులు గోపాల్‌నాయక్, త్రివేణి, చిట్టెమ్మ, సమీవుల్లా, కిరణకుమార్, పావని, ఆనంద్, హేమావతి, స్వామి పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సాగా సురేష్, వుట్టి వరప్రసాద్, రమేష్‌బాబు పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఛైర్మన్ మనోహర్‌గుప్తా, అధ్యక్షులు తల్లం నారాయణ మూర్తి, కార్యదర్శి చిన్నప్ప, కోశాధికారి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు జింక చిన్నప్ప ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొట్లురు అనాథాశ్రమంలో అల్పాహారంతో పాటు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రపుల్ల చంద్ర, సంస్థ సహాయ కార్యదర్శి మంజునాథ్, జిల్లా ఛైర్మన్ రఘునాథ్ పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక గ్రామ సచివాలయం, ప్రయివేటు పాఠశాలల్లో గాంధీ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఫీ, సర్పంచి రహంతుల్లా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

నల్లచెరువు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శకుంతల ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, వైసిపి మండల కన్వీనర్ బట్టి హైదర్ వలి, ఎంపిటిసిలు భాస్కర్‌రెడ్డి, సుమియా, లక్ష్మీదేవి, నరసింహారెడ్డి, నాయకులు రాజశేఖర్, రఫీ, డాక్టర్ శంకర్, డైరెక్టర్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఎద్దుల రాముడు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిషోర్, రాంప్రసాద్ ,వెంకటేశు, అంజి ,వనమాలు నాగేశ్వరయ్య, మహబూబ్ బాషా జిలాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయం-1 వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచి రూప, ఎంపిడిఒ రాబర్ట్ జాన్‌విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, ఇఒఆర్‌డి కేశవరెడ్డి, సెక్రటరీలు సురేష్, జనార్దన్ పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక సచివాలయంలో సర్పంచి ఆదినారాయణ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సభ నిర్వహించి పంచాయతీ కార్మికులను సన్మానించారు. నవోదయ పాఠశాల, చోళసముద్రం పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ నాగరాజు, ఇఒఆర్‌డి శివన్న, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, సెక్రటరీలు ప్రకాష్, నాగేంద్ర, విజయ్, మారుతి పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో డిఆర్ఒ కొండయ్య, ఎఒ వెంకటనారాయణ, ఇతర అధికారులు గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, టిడిపి కార్యాలయంలో పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సభ నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు సుంకు చంద్రశేఖర్ గుప్త, జిల్లా గవర్నర్ పల్లం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సబ్‌జైలులో సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తెలిసి, తెలియక జైలుకు ఖైదీలుగా వచ్చారని, భవిష్యత్తులో నేరాలు చేయకుండా మంచి జీవితం గడపాలని తెలిపారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : డిఎంహెచ్ఒ ఎస్వి కృష్ణారెడ్డి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛంధ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శర్మ, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి కిషోర్ కుమార్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, సునిత, రాజేష్, ఎరుకలప్ప, అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని రాణి పేట స్కూల్‌లో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంటవెంకటప్రసాద్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పరికి నజీమున్నీసా సాదిక్, కమిషనర్, వైస్ ఛైర్మన్లు పాల్గొన్నారు.


పరిగి : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా మందిర్, ఎఎం లింగన్న విద్యాసంస్థల్లో సంస్థ నిర్వాహకులు కెటి శ్రీధర్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి లక్ష్మీదేవిశివశంకర ఆధ్వర్యంలో గాంధీ జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, జయరాములు, సలీం, మారుతేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అలీఖాన్ పాల్గొన్నారు.

హిందూపురం : గాంధీ జయంతి సందర్భంగా స్థానిక ఐదు లాంతర్ల సర్కిల్‌లో గాంధీ విగ్రమానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విగ్రహం ముందు మోకాళ్లపై కుర్చొని నిరసన తెలిపారు. అనంతరం ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో సత్యమేవ జయతే దీక్ష చేపట్టారు. దీక్షలో రావిళ్ల లక్ష్మి, అంబికా లక్ష్మినారాయణ, నాగరాజు, రమేష్ కుమార్, శివశంకర్, చంద్రమోహన్‌యాదవ్, అంజనప్ప, అమర్‌నాథ్, మంగేష్, నెట్టప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

తలుపుల : గాంధీ జయంతి సందర్భంగా వైసిపి సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె బాబు ఎమ్మెల్యే పివి సిద్దా రెడ్డి ద్వారా పారిశుధ్య కార్మికులకు 25కిలోల చొప్పున బియ్యం నెలకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శకుంతలమ్మ, మేజర్ పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ డిపి.ఫయాజ్, వార్డు మెంబర్లు మౌలా, సుబహాన్, రమేష్, శ్రీనాథ్, హరి, ప్రభు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, జడ్పిటిసి కోటి సుధ, ఎంపిడిఒ సాయిమనోహర్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయం, పోట్లమర్రి సచివాలయం, పశువైద్యశాలలో గాంధీ జయంతి సభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సిఎస్‌డిటి శారద, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి దివాకర్, మల్లికార్జున, చిన్న సూరి, పోట్లమర్రి సచివాలయంలో బగ్గిరి బయపరెడ్డి, హనుమంతరెడ్డి, బండి నాగభూషణ, కమతం శంకర పాల్గొన్నారు.



ధర్మవరం సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి

కదిరి రూరల్ : మండల పరిధిలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఎంఎస్. కిరణ్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ముదిగుబ్బ : స్థానిక ఎస్‌డిఆర్‌ఆర్ కాలేజీలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, వైసిపి మండల కన్వీనర్ సివి రెడ్డి, తదితరులు గాంధీ జయంతి సభ నిర్వహించారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఈరన్న, ఎంపిడిఒ మునిస్వామి గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండ లంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. కార్యక్రమం లో వీఆర్వో కృష్ణప్ప, ఏపీవో గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. బత్తల హరిప్రసాద్, డా. బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుద్దీన్, రమణ, బాబా, పురుషోత్తం రెడ్డి, ఫరూఖ్, జకీర్, న్యమత్, సంపంగి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : కాంగ్రెస్ నాయకులు నిషార్ అహమ్మద్, బాసినేని ప్రభాకర్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు.

హిందూపురం : మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సభలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి దీపిక, ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం నుంచి రహమత్‌పురం వరకూ స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రహమ త్‌పురం సర్కిల్‌లో మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్లు సిపిసి సాధిక్, వాల్మికి నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం, కాంగ్రెస్, టిడిపి, వివిధ ప్రజాసంఘాలతో పాటు ఆల్‌ఆమీన్ పాఠశాల, బిట్ కళాశాల, ఎస్‌డిజిఎస్ కళాశాలలు, రైల్వే పెన్షనర్స్, రైల్వే ఉద్యోగులు, తదితర సంఘాల ఆద్వర్యంలో గాంధీ జయంతి సభ నిర్వహించారు. ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో పోస్టు మాస్టర్ మార్కండేయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



జాతిపితకు నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి దీపిక, చైర్‌పర్సన్, తదితరులు